క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంప్

మదనపల్లె సిటీ: ఉచిత హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ది హాకీ అన్నమయ్య జిల్లా కోశాధికారి ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో స్పోర్ట్స్ అథారిటీ, సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో హాకీ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు క్యాంపు జరుగుతుందన్నారు. ఈ క్యాంపు మే 30 వతేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాంప్‌లో 8 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల ఉన్న వారు పాల్గొనవచ్చునన్నారు. కోచ్‌గా నౌషాద్ వ్యవహరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9492377889, 7386898900 సంప్రదించాలని కోరారు.

30న పాలిసెట్ పరీక్ష

కలికిరి: ఈ నెల 30న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్–2025) నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.శ్రీనివాసులు తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాలిసెట్ ఏపీ.ఎస్‌బీసీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

కలికిరి: గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభమవుతాయని గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించడం జరుగుతుందని, కథలు చదవడం, రాయడం, తెలుగు బాషాభివృద్ధి, డ్రాయింగ్, పెయింటింగ్, జనరల్ నాలెడ్జ్, యోగా తదితర అంశాలపై పిల్లలకు తరగతులుంటాయని తెలిపారు. జూన్ నెల 6 వరకు తరగుతులు నిర్వహిస్తామని, అవకాశాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఆయన కోరారు.

పింఛన్లకు దరఖాస్తులు

బి.కొత్తకోట: పింఛన్ తీసుకుంటూ మరణించిన భర్త స్థానంలో భార్యకు పింఛన్ మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ జీవీ.పల్లవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబర్ ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య కాలంలో 60 ఏళ్లు నిండి వుండి పింఛన్ తీసుకుంటున్న భర్తలు మరణించి ఉంటే వారి భార్యలు పింఛన్ పొందడానికి అర్హులని తెలిపారు. ఈ పింఛన్ల మంజూరు కోసం వారి పరిధిలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అమల్లో 30 పోలీసు యాక్టు

బి.కొత్తకోట: మండలంలో 30 పోలీసు యాక్టు అమలులో ఉందని సీఐ జీవన్ గంగనాథ్‌బాబు ఆదివారం తెలిపారు. రాజకీయ పార్టీలు, సంఘాలు ఎవరైనా పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. ఏ కార్యక్రమం నిర్వహించదలచుకున్నా ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

రేపు ఆంజనేయస్వామి తిరునాల

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె శ్రీ ఆంజనేయస్వామి తిరునాల మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఉదయం ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు, చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జీఓ 30 సద్వినియోగం చేసుకోండి



ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహ క్రమబద్ధీకరణ జీవో 30ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, అనాధీనం, గయాలు స్థలాల్లో అనుమతి లేకుండా 2019 అక్టోబరు 15 కంటే ముందు ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారు తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత రికార్డులతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటి పన్ను, కరెంట్ బిల్లులు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు సమర్పించి ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు సుధాకర, హేమంత్ నాయక్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కాలువ తీశారు.. పనులు మరిచారు



కాలువ శుభ్రం చేయకుండా వదిలేసిన దృశ్యం



బస్టాండ్ ప్రాంగణంలో దుర్గంధం వెదజల్లుతున్న మరుగుదొడ్ల నీరు

- ఆరు నెలలుగా వ్యాపారుల అవస్థలు
- మూత పడిన ఆర్టీసీ వ్యాపార సముదాయాలు
- పట్టించుకోని అధికారులు

పీలేరు : పీలేరు పట్టణంలో మురుగునీటి కాలువల కోసం పలు చోట్ల జేసీబీతో తవ్వేసి అనంతరం పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో వాహన చోదకులు, ప్రయాణికులు, స్థానిక దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల అర్థాంతరంగా వదిలేసి నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న పంచాయతీ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎల్‌బీఎస్ రోడ్డులో మురుగునీటి కాలువలను శుభ్రం చేసే క్రమంలో పంచాయతీ వారు కాలువ పైకప్పు తొలగించి, మట్టిని తొలగించారు. పనులు చేపట్టి అరు నెలలు కావస్తున్నా కాలువలు పైకప్పు పనులు చేపట్టలేదు. దీంతో దుకాణ దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలకు వేలు దుకాణాలకు అద్దెలు చెల్లిస్తున్నామని, ఇలా అర్ధాంతరంగా పనులు అపేస్తే తమ వ్యాపారం ఎలా చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కాలువలు దుర్వాసన వెదజల్లుతుండడంతో వినియోగదారులు కూడా ఎవరూ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆర్టీసీ బస్టాండులోనికి ప్రయాణీకుల ప్రధాన మార్గానికి అడ్డుగా కాలువ తీసి వదిలేశారు. ఆ మార్గంలో ఉన్న వ్యాపార సముదాయాలు పూర్తిగా మూతపడ్డాయి. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్ల నీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రయాణికులు, వ్యాపారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్టీసీ అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వ్యాపారాలు జరగడం లేదు



బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ రూములో అద్దెకు ఉంటూ పండ్ల వ్యాపారం నిర్వహించుకుంటున్నా. కాలువ పనులు చేపట్టి ఐదు నెలలు పైగా అవుతోంది. అర్ధాంతరంగా ఆపేసారు. దీంతో కాలువ దాటి ఎవరూ పండ్లు కోసం రావడం లేదు. సుమారు 40 వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. వ్యాపారం లేకపోతే ఎలా అద్దె కట్టాలి.

-అమానుల్లా, పండ్ల వ్యాపారి

దుర్గంధం భరించలేకున్నాం



కాలువలు తవ్వేసి అర్ధాంతరంగా పనులు ఆపేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎల్‌బీఎస్ రోడ్డు నుంచి బస్టాండు ప్రాంగణం వరకు ఎటు చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. అటు పంచాయతీ అధికారులు కానీ, ఆర్టీసీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

- ముబారక్, పండ్ల వ్యాపారి

ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శం


వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



షాలేం చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : ఇతరుల పట్ల ప్రేమ, సహనం, శాంతి, సేవాభావం వంటి గొప్ప గుణాలను ఆచరించాలని శాంతిదూత ఏసుక్రీస్తు ఇచ్చిన సందేశం అందరికీ ఆదర్శమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. పట్టణంలోని రామారావుకాలనీ షాలేం చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ సామ్సన్, నిసార్‌అహ్మద్‌ను ఆత్మీయంగా ఆహ్వానించి, ప్రార్థన జరిపి ఆశీర్వాదం అందజేశారు. అనంతరం చర్చిలో ప్రార్థనలకు హాజరైన వారిని ఉద్దేశించి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గంలో నడవాలని ఆకాంక్షించారు. మతం పేరుతో జరుగుతున్న నరమేధం ప్రజల మధ్య వైషమ్యాలు పెంచి మనుషులను దూరం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గామ్ దాడిలో చనిపోయిన అమాయక ప్రజల కుటుంబాలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేద్దామని పిలుపునిచ్చారు. ఉగ్రదాడిని ఖండించారు. ప్రతి ఒక్కరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని, ప్రజల మధ్య మత విద్వేషాలు వద్దని కోరారు. ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళి శాంతికి చూపే దారులని కీర్తించారు. ప్రజలపై ప్రభువు దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం రెడ్డెప్పనాయుడు కాలనీలో డిష్యారూసాబ్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, మునిశేఖర్, నర్సింహులు, ఆర్టీఏ నూర్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్, సాదిక్, యూనస్, మల్లికార్జున, చరణ్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రదాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి

మదనపల్లె : కశ్మీర్ పహల్గాంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన దాడి అత్యంత నీచమైన, హేయమైన చర్యగా వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.....ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందులో పాకిస్తాన్ మిలిటరీ హస్తం పూర్తిగా ఉందని ఐబీ వర్గాల ద్వారా నిర్ధారణ జరిగిందన్నారు. పాకిస్తాన్ టెర్రరిస్ట్ దేశాల్లో నెం.2 స్థానంలో ఉండటమే కాకుండా ఉగ్రవాదుల తయారీ దేశంగా మారిందన్నారు. అక్కడ అరాచకం రాజ్యమేలుతోందన్నారు. ప్రశాంతంగా ఉన్న కశ్మీర్‌ను అల్లకల్లోలపరిచి, ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో, దేశ సుస్థిరతను దెబ్బతీయడమే లక్ష్యంగా పాకిస్తాన్ ఉగ్రదాడులకు పాల్పడిందన్నారు. కుల,మతాలు,పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం ఏ చర్యలు తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఇస్తామని చెప్పడం శుభపరిణామమన్నారు. పాకిస్తాన్‌ను ఎదుర్కొనేందుకు దేశపౌరులంతా ఏకతాటపైకి వచ్చి నిరసన గళం వినిపించడం ఐక్యతను చాటిచెప్పిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఇంటలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి, దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. విహారయాత్రకు వెళ్లి ఉగ్రదాడి ఘటనలో చనిపోయిన 27 మంది పర్యాటకుల కుటుంబసభ్యులకు తీరనిశోకమన్నారు. వారందరికీ వైఎస్సార్ సీపీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తూ, అందరూ ధైర్యంగా ఉండాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆల్‌పార్టీ మీటింగ్‌లో వైఎస్సార్ సీపీ తరపున లోక్‌సభపక్షనేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఉగ్రదాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, బేషరతుగా కేంద్రప్రభుత్వం తీసుకునే చర్యలకు మద్దతు ఇస్తామని తెలిపారన్నారు. ఉగ్రదాడులకు పాల్పడిన ముష్కరులపై కేంద్రం కఠినచర్యలు తీసుకొని కోట్లాదిమంది భారతీయుల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు.

'మానవత' సేవలు విస్తృతం చేస్తాం



సమావేశంలో మానవత సంస్థ సభ్యులు

పీలేరురూరల్ : మానవత సేవలు మరింత విస్తృతం చేస్తామని ఛైర్మన్ డాక్టర్ వి. రామచంద్ర అన్నారు. ఆదివారం మానవత సంస్థ అధ్యక్షుడు శెట్టి సుబ్రమణ్యం అధ్యతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది పేదలకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక నమోదు చేసే ఉపాధ్యాయులకు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు కృష్ణమూర్తి, వై.వి. రమణ, జగన్‌మోహ, అశోక్, నాగరాజ, రమణ, అక్రంబాషా, గఫార్ సాహెబ్, రమేష్, హరికుమార తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో దళితుల బహిష్కరణ బాధాకరం



మాట్లాడుతున్న గుర్రం నారాయణ

పీలేరు : పిఠాపురం నియోజకవర్గంలో ఓ ఊరి నుంచి దళితులను బహిష్కరించడం బాధాకరమని అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఉమ్మడి చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు గుర్రం నారాయణ అన్నారు. ఆదివారం పీలేరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిష్కరణకు గురైన దళితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాలలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై ఎలా పోరాటం చేయాలో చర్చించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక రాయలసీమ రీజనల్ కన్వీనర్ చీకటిపల్లె రామాంజులు, నాయకులు గుండ్లూరు జయరామచంద్రయ్య, రమేష్, మల్లికార్జున, నాగరాజ, శశినందన్, చంద్రయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దు

– సీఐ లక్ష్మన్న



కాలనీ వాసులకు సూచనలు ఇస్తున్న సీఐ లక్ష్మన్న

బి.కొత్తకోట : అనుమానితులకు ఇళ్లల్లో ఆశ్రయం కల్పించవద్దని ములకలచెరువు సీఐ లక్ష్మన్న ప్రజలను కోరారు. ఆదివారం ఉదయం బి.కొత్తకోట బీసీ కాలనీలో పోలీసులతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 38 బైకులు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మొత్తం పదార్థాల విక్రయం, సేవించడం చట్టరీత్యామని వివరించారు. నిషేధిత మత్తు పదార్థాలు కలిగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సారా విక్రయాలు చేయరాదన్నారు. ఎక్కడో నేరాలు చేసి ఇక్కడికి వచ్చి తలదాచుకునే వాళ్లను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారికి ఆశ్రమిస్తే మీరు చిక్కుల్లో పడతారని హెచ్చరించారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



వాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కాన హజ్ కమిటీ చైర్మన్ హుస్సేన్‌బాషా

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులోని ఈద్గా మైదానంలో ఆదివారం పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హుస్సేన్‌బాషా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట ప్రాంతాల నుంచి 110 హజ్‌యాత్రకు వెళ్తున్నారన్నారు. వీరికి వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. హజ్ యాత్రికులు మే 13వ తేదీన హజ్‌యాత్రకు బయలుదేరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, జునైద్ అక్బరీ, హజ్ సొసైటీ సభ్యులు ఎండి.ఖాన్, ఇస్మాయిల్, రఫీక్‌బేగ్, బషీర్, డిష్యారూ, సలీమ్, జామియా మసీదు పెద్దలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులు చదువులో రాణిస్తే ప్రోత్సాహం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో యాదవ సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: యాదవ విద్యార్థులు చదువులో రాణిస్తే ప్రోత్సాహం అందిస్తామని యాదవ సంఘం అధ్యక్షులు గురుశంకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక అనపగుట్టలోని శ్రీకృష్ణ ఆలయంలో డివిజన్ పరిధిలోని 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులకు యాదవ సొసైటీ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ప్రోత్సహక నగదు, ప్రసంసాపత్రాలు అందజేశారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటయ్యాయాదవ్, రెడ్డప్పయాదవ్, రమణ, శ్రీధర్‌యాదవ్, కుమార్‌యాదవ్, సురేష్‌యాదవ్,బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

బి.కొత్తకోట: చట్టాలను రద్దు చేస్తూ కార్మికుల హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. బి.కొత్తకోటలో వచ్చేనెల 10, 11న మదనపల్లెలో జరిగే జిల్లాస్థాయి వర్క్‌షాప్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్పోరేట్ అనుకుల నిర్ణయాలతో కేంద్రం కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోందన్నారు. ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. మదనపల్లెలో నిర్వహించే వర్క్‌షాప్‌కు వివిధవర్గాలకు చెందిన మేధావులు, ఏఐటియూసీ నేతలు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో వేణు, సలీం, షమీవుల్లా, బాలకృష్ణ, శివ, ఆజాద్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

వెబ్ డెవలపింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో వెబ్ డెవలపింగ్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ సోమవారం నుంచి ప్రారంభిస్తామన్నారు. నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు కోర్సు కోఆర్డినేటర్ నవీన్ 9553202509ను సంప్రదించాలన్నారు.

నేరాలను అరికట్టేందుకు కృషి చేయాలి

–డీఎస్పీ మహేంద్ర

తంబళ్లపల్లె: నేరాలను అరికట్టేందుకు కృషి చేయాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. నేరాలపై ఎస్ఐ లోకేష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, రాత్రి వేళ పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై ఆరా తీశారు. వాహన చోదకులు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రించేందుకు చొరవ చూపాలన్నారు. రౌడీషీటర్లు డీసీ లిస్టులో ఉన్నవారిపై నడవడికలో మార్పు వచ్చే విధంగా చూడాలన్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

కలికిరి: మండలంలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం అర్హత, ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ కరీముల్లా ఆదివారం తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉందని, అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, బీసీ, మైనారిటీ, ఓసీ(అల్పాదాయ వర్గాలు) దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఎంఈఓ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో సంప్రదించవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉన్నత పాఠశాలుగా అప్‌గ్రేడ్ :
మండల పరిధిలోని మర్రికుంటపల్లి, గుట్టపాళెం ఎంపీయూపీ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయినట్లు ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున తెలిపారు. అవకాశాన్ని ఆయా ప్రాంత ప్రజలు పిల్లలను ఉన్నత పాఠశాలలో చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈసందర్బంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు,అభిషేకాలు చేశారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

'పది' ఫలితాల్లో ప్రభుత్వ బడులు వెనుకబాటు



గట్టు జెడ్పీ హైస్కూల్

బి.కొత్తకోట: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యాబోధన, నాణ్యత ఏ మేరకు ఉందో బుధవారం వెల్లడైన పదవ తరగతి పరీక్ష ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి. అధఃపాతాళానికి వెళ్లిన ఫలితాలతో ఆయా ప్రభుత్వ పాఠశాలల పనితీరు ప్రశ్నార్థకమవ్వగా వచ్చే విద్యా సంవత్సరంలో దారుణమైన ఫలితాలొచ్చిన ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు సముఖత వ్యక్తం చేస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ వివరాల్లోకి వెళితే..బి.కొత్తకోట బాలుర హైస్కూల్‌లో 48 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 26 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 70 మంది పరీక్షలు రాస్తే 40 మంది, ఉర్దూ హైస్కూల్‌లో 26 మందికి 13 మంది, బడికాయలపల్లె హైస్కూల్‌లో 39 మందికి 33 మంది, బీరంగి హైస్కూల్‌లో 36 మందికి 20 మంది, గట్టు హైస్కూల్‌లో 63 మందికి 27 మంది, గోళ్లపల్లి హైస్కూల్‌లో 51 మందికి 29 మంది, బి.కొత్తకోట మోడల్ స్కూల్‌లో 60 మందికి 39 మంది, కేజీబీవీలో 35 మందికి 22 మంది, గురుకుల విద్యాలయంలో 77 మందికి 63 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 510 మంది పరీక్షలు రాస్తే పాసైన వారు 312 మంది అంటే విద్యాబోధన తీరుపైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా క్యాండిల్ ర్యాలీ



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు



కలకడలో ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

మదనపల్లె : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆదివారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. బెంగళూరు బస్టాండ్‌లోని టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ, టౌన్‌బ్యాంక్ సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ...అందరం ఒక్కటై ఉగ్రవాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు. దాడులకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, హజ్‌కమిటీ డైరెక్టర్ పఠాన్‌ఖాదర్‌ఖాన్, నాయకులు ఆర్.జే.వెంకటేష్, రాటకొండ సోమశేఖర్, ఆర్.కే.రామకృష్ణ, బెల్లే రెడ్డిప్రసాద్, జాన్‌బాబు, జనసేన దారం అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను తరిమికొట్టాలి

కలకడ: ఉగ్రవాదాలను తరిమికొట్టాలని బీజేపీ పీలేరు నియోజకవర్గ కన్వీనర్ పాత్తూరి శ్రీకాంత్‌నాయుడు పిలుపు నిచ్చారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం కలకడలో శాంతి ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై.. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం కలకడ మూడు రోడ్ల కూడలిలో మాట్లాడుతూ మతోన్మాద ఉగ్రవాదంతో దేశాన్ని విచ్ఛిన్నం చేయలాని పాకిస్తాన్ చూస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలన్నారు. ఉగ్రదాడుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఆంజినేయులు, నాయకులు శ్రీనివాసులురెడ్డి, బివి స్వామి, పివి నాయుడు, చిన్నప్పనాయుడు, శేఖర్, మైనార్టీ నాయకులు జిలానీ బాష, ముబారక్‌అలీ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.